క్లుప్తంగా

వరద బాధితులను ఆదుకోండి

జనగామ: భారీ వర్షాలతో జిల్లాలో దెబ్బతిన్న రహదారులు, పంట పొలాలకు సంబంధించి నష్టపరిహారం అందించే విధంగా ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అమ్మఫౌండేషన్ గౌరవ సలహాదారుడు వంగ భీమ్ రాజ్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రహదారులు కోతకు గురికావడంతో జన జీవనం ఎక్కడిక్కడ స్తంభించిందన్నారు. వందలాది ఎకరాల్లో వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లగా, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. వ్యాధులపై వైద్యారోగ్య శాఖ అప్రమత్తం కావాలని విజ్ఞప్తి చేశారు. జనగామ పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో ప్రజలకు శాపంగా మారిందన్నారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని గంగాపూర్ గ్రామంలో మృతి చెందిన బందారం భాస్కర్ కుటుంబ సభ్యులకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పంపించిన రూ. 10 వేలను మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నర్సింహులు, నాయకులు ఉన్నారు.

'విషజ్వరాలు విజృంభిస్తున్నా పట్టని ఎంపీ, ఎమ్మెల్యే'



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గ పరిస్థితులు దౌర్భాగ్యంగా ఉన్నాయని, విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య పర్యవేక్షణ లేదని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, నాయకులు తాటికొండ సురేష్‌కుమార్, గుర్రం శంకర్, గోవిందు అశోక్, శ్రీను, రంజిత్ పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ తప్పదు

బచ్చన్నపేట: ఉద్యోగికి విరమణ తప్పదని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం అన్నారు. బుధవారం కట్కూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మామిడాల ప్రభాకర్ ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. మండల నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆస్పత్రికి సర్వ ప్రేమ వెల్ఫేర్ సొసైటీ హైదరాబాద్ వారు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆస్పత్రికి సొసైటీ వారు ఆపరేషన్ థియేటర్‌లో రూ. 61,500 విలువైన ఏసీ. రూ. 45వేల ఆపరేషన్ పరికరాల శుద్ధీకరణ యంత్రం, అలాగే రూ. 11వేల నీటి శుద్ధీకరణ యంత్రాన్ని అందించినట్లు తెలిపారు. సొసైటీ నిర్వాహకులు సరిత, విజయ్, కస్పారెడ్డి, లయిస్‌రెడ్డి సురేష్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు చేయండి

రఘునాథపల్లి: భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కుమ్మరికుంట్ల దాసు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు రోడ్లు గుంతలమయమై నీరు నిలుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన పోరాట యోధులను స్మరిస్తూ ఈ నెల 15 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బస్టాండ్ సమీపంలో వర్షపు నీరు నిలిచిన కంచనపల్లి రోడ్డు వద్ద పార్టీ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. మహేందర్, చందునాయక్, నాగరాజు, ఐలయ్య, ఆంజనేయులు, సాంబరాజు, భిక్షపతి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



తరిగొప్పుల: వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు



జనగామ రూరల్: పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్



కొడకండ్ల: నర్సింగాపురంలో..

తరిగొప్పుల: సీజనల్ వ్యాధుల దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ రాగలత సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అంకుషాపూర్ శివారు బంజరుపల్లిలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎక్కువ శాతం కలుషిత నీటి ద్వారా వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమనగంటి మహేందర్, ఏఎన్‌ఎం దేవేంద్ర,ఆశా వర్కర్లు, ప్రేమలత, లలిత, సుధా, షహనాజ్, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

జనగామ రూరల్: మండలంలోని చంపక్‌హిల్స్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఓబుల్‌కేశవాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ల బృందం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం జె.లచ్చిరాం, ఉపాధ్యాయులు వాసు, హెచ్‌డబ్ల్యూఓ హరిచందర్, రతన్‌సింగ్, సరోజన, ఏఎన్‌ఎం స్వాతి, స్వరూప, రాములు, వీరన్న, సారయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొడకండ్ల: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్త వహించవచ్చని డాక్టర్లు హరికృష్ణ, పేరం విజయవర్షిణి సూచించారు. నర్సింగాపురం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో దోమల వలన డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని అన్నారు. సీహెచ్‌ఓ దయాకర్, వైద్య సిబ్బంది రమేష్, శోభ, ఆశ వర్కర్ సావిత్రిలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా 75 మంది

● నేడు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానం

జనగామ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2024 సంవత్సరానికి గాను జిల్లాలోని వివిధ కేటగిరీల పరిధి ఉపాధ్యాయుల్లో ఉత్తమ సేవలందించిన వారిని విద్యా శాఖ అవార్డులకు ఎంపిక చేసింది. ఈ మేరకు మొత్తం 75 మంది పేర్లతో బుధవారం జాబితా విడుదల చేసింది. గురువారం (నేడు) కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యాన నిర్వహించే గురుపూజోత్సవం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖుల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

బచ్చన్నపేట మండలానికి చెందిన వి.రాజేందర్‌రెడ్డి, కె.మల్లారెడ్డి, జి.నర్సింహస్వామి, ఎస్.అమృత, పి.నర్సమ్మ, సీహెచ్ శేఖరయ్య, పి.యాదగిరి, చిల్పూరు మండలంలోని ఆర్ సరోజన, వి.ప్రకాష్, కె.కళ్యాణి, వి.వాణిశ్రీ, ఎ.రాజవేణుగోపాల్‌రెడ్డి, కె.అరుణ, దేవరుప్పుల మండలంలోని వి.రవికాంత్, వై.బాలనర్సయ్య, వి.ఉమారాణి, జి.నిరంజని, జి.తి రుపతిరెడ్డి, డి.కీమా, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని సీహెచ్.రవీందర్, వి.సంధ్యారాణి, వి.లింగమూర్తి, పీ.టీ.సీ మనోహరి, పి.లలితాకుమారి, టి.మానస, జె.లచ్చిరాం, జనగామ మండలంలోని చల్లా అరుణ, ఐ.మాదేవి, చంద్ బేబీ, ఎ.కిషన్, కేఎల్.మల్లారెడ్డి, ఆర్.రాధిక, డి.గోపాలకృష్ణ, కొడకండ్ల మండలంలోని రజియాభేగం, బి.మౌనిక, సీహెచ్ రామనాథ్, బి.శ్రీనివాసచారి, జి.వేణు, వి.స్వప్న, లింగాలఘనపురం మండలంలోని కోటయ్య, వై.వెంకటేశ్వర్‌రెడ్డి, సీహెచ్ సమ్మక్క, వై.శ్రీనివాస్, మారెపల్లి అలెగ్జాండర్, కె.కృష్ణవేణి, కె.జ్యోతి, టి.లక్ష్మణ్‌గౌడ్, నర్మెట మండలంలోని పి.దామోదర్, ఎస్.కమళ, కె.అంజనేయచారి, ఎస్.నాగమణి, వి.సదానందం, కె.మధుసూదన్, పాలకుర్తి మండలంలోని సీహెచ్ అశోక్ కుమార్, ఎం.రాంమ్మోహన్‌రావు, టి.హేమలత, ఎస్.శ్రీనివాస్, ఎ.సరిత, ఎస్.అరుణకుమారి, బి.నర్సిహస్వామి, రఘునాథపల్లి మండలంలోని మిర్యాల దేవేందర్‌రెడ్డి, ఐ.జయకృష్ణ, పి.చంద్రయ్య, ఎ.పవన్ కుమార్, డాక్టర్ పి.రవీందర్, తరిగొప్పుల మండలంలోని జి.జోసఫ్‌బేబీ, జె.ఎల్లయ్య, టి.బయ్యన్న, వి.జయేందర్, జె.సుహిత, జాఫర్‌గఢ్ మండలంలోని వి.శ్రీనివాస్, ఎస్.కుమార్, పి.మనోహర్‌స్వామి, ఆర్.కిరణ్‌కుమార్, టి.సుధాకర్‌లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ ప్రజలకు నీలిమ ఆస్పత్రిలో ఆధార్ కార్డు చూపిస్తే ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. బొడిగం చెంద్రారెడ్డి, బావండ్ల కృష్ణంరాజు, సిద్దారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రక్తదానం



జనగామ: జనగామ వాసవి వనిత క్లబ్ గెలాక్సీ ఆధ్వర్యంలో వాసవి వారోత్సవాలు, ఫౌండేషన్ ప్రతినిధి ఆర్‌సీ గుప్తాజయంతిని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఏకశిల డిగ్రీ కాలేజీలో రక్తదాన శిబిరం, రాజరాజేశ్వరి వృద్ధాశ్రమం, వర్ధన్ ఆశ్రమంలో అనాథలకు పులిహోర, బ్రేడ్ పాకెట్లను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పుసనాల శ్రీవల్లి, సెక్రెటరీ గాదె పావని, ట్రెజర్ బజ్జూరి పావని, గవర్నర్ భానురి నరసింహులు, రీజియన్ చైర్మన్ శుభోద్ గుప్తా, మహంకాళి ఉమామహేశ్వర్, గందె వేణు, అయిత శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల : నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలనకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన చేస్తున్నదని, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని, పారదర్శకంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోల చంద్రమోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, ఆర్‌వి శ్రీనివాస్, నాయకులు అబ్దుల్లా, రవిందర్, అంజయ్య, సునీల్‌రెడ్డి, మనోహర్, వెంకన్న, రంగయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



చిల్పూరు: ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషి ఫలితంగానే చెరువులు మత్తడి పోస్తున్నాయని చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పల్లగుట్టు గ్రామంలో మత్తడి పోస్తున్న వెంకటాద్రి చెరువు వద్ద బుధవారం రైతులుతో కలిసి ఆయన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. గడ్డమీది సురేష్, దుర్గాప్రసాద్, చిర్ర నాగరాజు, బొట్టు చేరాలు, జక్కుల రాజయ్య, సునీల్, రత్నాకర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



విజయశ్రీని సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ఎంపీడీఓగా అనుముల విజయశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఘన్‌పూర్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఉమాదేవి ఇటీవల బదిలీపై వెళ్లగా కొద్దిరోజులుగా చిల్పూరు మండల ఎంపీఓ మధుసూదనాచారి స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా, ప్రస్తుతం ఘన్‌పూర్‌కు పూర్తిస్థాయి ఎంపీడీఓగా కోదాడ నుంచి బదిలీపై వచ్చిన విజయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన విజయశ్రీకి కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

సంక్షిప్త సమాచారం

బీజేపీ బలోపేతానికి పాటుపడాలి

బచ్చన్నపేట: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పాటుపడాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బు రమేశ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రమౌళి, నాగేష్, నవీన్, సురేష్, కేశవులు, కనుకయ్య పాల్గొన్నారు. అలాగే పోచన్నపేట గ్రామంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

'యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి గెలుపునకు కృషి'

జఫర్‌గఢ్: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న తాటికాయల రాజేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న మొగిళిపాక ఉదయ్‌కిరణ్‌ను గెలుపునకు కృషి చేయాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి కోరారు. మండలంలోని రఘునాథ్‌పల్లి, కూనూర్ తదితర గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ ఓటింగ్‌ను వెంకటస్వామి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. స్రవంతి , సందీప్, సుధీర్, అశోక్, రాజు, మేటి చిరంజీవి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బా, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన నాయకులతో కలిసి బుధవారం సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సుమ, వంశీతేజ, ఆర్య పాల్గొన్నారు.

చిన్నారుల సంఖ్యను పెంచాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య అన్నారు. గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. అలాగే చిన్నారులకు వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా గుడ్లు, ఆహార పదార్థాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ నాయకుల దుష్ప్రచారం

పాలకుర్తి: ఖమ్మంలో మాజీ మంత్రుల కార్లపై జరిగిన రాళ్లదాడి నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుగ్గిళ్ల ఆదినారాయణ, నీరటి చంద్రయ్య, బండిపెల్లి వెంకన్న, బత్తిని అశోక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

పాలకుర్తి టౌన్: పాలకుర్తిలోని ఏడీఈ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎస్‌వీ వేణుగోపాలచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బచ్చన్నపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ మల్లికార్జున్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని అన్నారు. త్వరలోనే ఓటరు జాబితాను కూడా ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

గణపతి మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలపరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా పోలీసుశాఖ నుంచి అనుమతి తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ జి.వేణు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే ఉత్సవ కమిటీ బాధ్యులు గణనాథుడి విగ్రహాలు పెట్టే స్థలం యజమాని అనుమతితో పాటు విద్యుత్ శాఖ, పోలీసుశాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు.

తేలు కాటుతో కూలీ మృతి



లావణ్య(ఫైల్)

బచ్చన్నపేట: తేలు కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కూలీ మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం సలాక్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మద్దూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలం కొడవటూర్ గ్రామానికి చెందిన దండుగుల లావణ్య(28) రోజూ మాదిరిగా మంగళవారం సలాక్‌పూర్‌లోని కామిడి జీవన్‌రెడ్డి రైతు వ్యవసాయ భూమిలో పనికి వెళ్లింది. కంది చేనులో లావణ్య కలుపు తీస్తుండగా కాలుకు తేలు కుట్టింది. తేలు కుట్టిందని తోటి కూలీలకు తెలుపగా వెంటనే మద్దూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలు భర్త మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గురుదేవోభవ!



వీవర్స్ కాలనీ పాఠశాలలో బోధిస్తున్న వాణిశ్రీ

జిల్లాలోని పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయుల సేవలపై ప్రత్యేక కథనం..

నాడు 11 మంది.. నేడు 100



విద్యార్థులతో టీచర్ నాగరాజు

జనగామ: జనగామ పట్టణం వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు 2011 సంవత్సరం హెచ్‌ఎం తాండ్ర నాగరాజు, ఉపాధ్యాయురాలు బుక్క వాణిశ్రీ వేర్వేరు ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చారు. ఆ సమయంలో 11 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. జిల్లా కేంద్రం కావడం, అందులో 20 వరకు ప్రైవేట్ స్కూల్స్ ఉండడంతో తల్లిదండ్రులు సర్కారు స్కూల్‌కు పంపడానికి ఆసక్తి చూపలేదు. ఇద్దరు టీచర్లు నిత్యం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి మీ పిల్లలను ప్రయోజకులను చేస్తామని ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కలిగించడానికి ప్రయత్నించారు. ఆ మేరకు బోధనలో అనేక మార్పులు తీసుకు రావడంతో 11 మంది నుంచి ప్రస్తుతం 100కు పైగా విద్యార్థులతో వీవర్స్ కాలనీ పీఎస్ పూర్వ వైభవం సంతరించుకుంది. కౌన్సిలర్‌తో పాటు కాలనీ ప్ర జల సహకారంతో ముందుకు వెళ్తున్నారు. ఇటీవల టీచర్ నాగరాజు బచ్చన్నపేట మండలం కొన్నె, వాణిశ్రీ జనగామ మండలం మరిగడికి బదిలీ కాగా.. విద్యార్థులు వదిలిపెట్టలేక పోయారు. రాత్రి వరకు కాలనీవాసులతో కలిసి బడిలో ఉన్న ఉపాధ్యాయులు.. విద్యార్థులకు నచ్చచెప్పడంతో వీడ్కోలు పలికారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై మరిగడికి వెళ్లిన ఉపాధ్యాయురాలు వాణిశ్రీకి తిరిగి ఇక్కడికే పోస్టింగ్ ఇవ్వడంతో విద్యార్థుల్లో ఎక్కడా లేని ఆనందం కనిపించింది.

గురువుల స్మరణలో..

నిమ్మ జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయుడు, భానాజీపేట (రఘునాథపల్లి)



ఓనమాలు నేర్చుకున్న నాటి నుంచి ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తయ్యే వరకు తరగతుల్లో బోధించి తమ ఉన్నతికి కారణమైన 101 మంది ఉపాధ్యాయులను ఏటా ఉపాధ్యాయ దినోత్సవం రోజు స్మరించుకుంటున్నారు రఘునాథపల్లి మండలం భానాజీపేటకు చెందిన ఉపాధ్యాయుడు నిమ్మ జయపాల్‌రెడ్డి. చాలామంది కాలం చేసినప్పటికీ స్మరించుకోవడం మరచి పోలేదు. గురువులు రమాదేవి, రత్నాకర్, యాదగిరి, కొండ రామచంద్రం, మేకల బాల సిద్దయ్య, నందిని సిద్దారెడ్డి నాడు బోధించిన పద్ధతులను స్ఫూర్తిగా తీసుకుని.. నేడు తన బడిలో పిల్లలకు వినూత్న రీతిలో ఆటపాటలు, ఓరిగామి కల ద్వారా (పేపర్లతో బొమ్మలు తయారుచేయడం) బోధన చేస్తున్నారు. కవితలు రాయడం, పాటలు పాడడం, మిమిక్రీ చేయడం, బొమ్మలు గీసి పేద విద్యార్థులకు పంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రయోగాలతో ప్రత్యక్ష అనుభూతి

జి.దామోదర్ రెడ్డి, సైన్స్ టీచర్ , ఓబుల్ కేశ్వాపూర్(జనగామ)




ఫిజికల్ సైన్స్ ప్రయోగాలతో విద్యార్థులకు బోధించడం వల్ల వారికి ప్రత్యక్ష అనుభూతితో పాటు చెప్పిన అంశం సులభంగా అర్థం చేసుకుంటారు. కొత్త ప్రయోగాలు చేయాలనే ఆసక్తి కలిగి, సబ్జెక్టు పరంగా ఇష్టం పెరుగుతుంది. అంతే కాకుండా శాస్త్రీయ విజ్ఞానం పెంపొందుతుంది. విషయం పరిజ్ఞానం ఎక్కువ కాలం గుర్తుంటుంది.



జనగామ వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల

కృత్యాలతో బోధన

బొగ్గారపు శ్రీనివాస్, టీచర్, (వడ్లకొండ పీఎస్)



విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు సులభంగా అర్థం చేసుకునేలా తక్కువ ఖర్చు మెటీరియల్‌తో బొమ్మలను ఆకృతులుగా మార్చి బోధన చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా బోధనను ఆసక్తిగా వింటూ సులభంగా చదువు నేర్చుకుంటారు. అభ్యసన కృత్యాలను ఉపయోగించి బోధించడం ఉపాధ్యాయులకు తక్కువ శ్రమతో ఎక్కువ అంశాలను నేర్పించే వెసులు బాటు కలుగుతోంది.

క్షేత్ర పర్యటనతో బోధన

బాలరాజు, టీచర్, సామాన్య శాస్త్రం (బచ్చన్నపేట)



తరగతి గదిలో, ప్రత్యక్ష అనుభవాన్ని కలిగించే విధంగా క్షేత్ర పర్యటనతో విద్యార్థులకు సామాన్య శాస్త్రం బోధిస్తున్నాం. ఇలా చేయడం ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విద్యతో పాటు ప్రత్యక్ష్యంగా చూసిన అనుభవాన్ని నిత్య జీవితంలో ఎలా అన్వయించుకోవాలో నేర్చుకోగలుగుతారు.

మూసివేత దశ నుంచి..



విద్యార్థులతో హెచ్‌ఎం పర్షయ్య

జనగామ రూరల్: జనగామ మండలం సిద్దెంకి ప్రాథమిక పాఠశాల 2018 సంవత్సరంలో 25 మంది విద్యార్థులతో మూసివేత దశకు చేరింది. అదే సంవత్సరం హెచ్‌ఎంగా పర్షయ్య విధుల్లో చేరారు. పాఠశాలను బాగుచేయాలనే ఉద్దేశంతో ఇంటింటికీ వెళ్లి పాఠశాలలో కల్పించే సదుపాయాలు, బోధన తదితర విషయాలను వివరించారు. యువత, విద్యార్థుల తల్లిదండ్రులు, మాజీ సర్పంచ్ సహకారంతో ప్రస్తుతం 100 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దాత అందజేసిన రూ.42 వేల సాయంతో స్కూల్‌కు పేయింటింగ్ వేయించి టీవీ, బెంచీలు ఏర్పాటు చేశారు.

ప్రోత్సాహం నింపుతున్న హెడ్మాస్టర్..





స్కూల్ బ్యాగులతో విద్యార్థులు, వెంకటేశ్వర్‌రెడ్డి

లింగాలఘణపురం: మండలంలోని కుందారం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పని చేస్తున్న యేరువ వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థుల్లో ప్రోత్సాహాన్ని నింపుతూ ప్రభుత్వ పాఠశాల పట్ల ఆసక్తిని పెంచుతున్నారు. ఎక్కడ పని చేసినా ప్రతి ఏడాది విద్యార్థుల కోసం సుమారు రూ.30వేలు సొంత డబ్బులు ఖర్చు చేసి పాఠశాల పేరుతో ప్రత్యేక డ్రెస్సులు, స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, పలకలు, ప్లేట్లు, టైలను విద్యార్థులకు కొనుగోలు చేసి ఉచితంగా ఇవ్వడం జరుగుతోంది. దీంతో కుందారం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 40 మంది ఉన్న విద్యార్థులు ప్రస్తుతం 60 మందికి చేరారు. ఇలా విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాలలపై ఆసక్తిని పెంచుతున్న హెడ్మాస్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సేవలు అభినందనీయం.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిల్పూరు: అవగాహన కల్పిస్తున్న మల్లీశ్వరి

జఫర్‌గఢ్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారంతో పిల్లలు, తల్లులు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ సుమాన్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కోనాయిచలం, కూనూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, ఏఎన్‌ఎం శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, గీతారాణి, సుందరి, సంధ్యరాణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చిల్పూరు: పిల్లల ఆరోగ్యంపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ మల్లీశ్వరి అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై గర్భిణుల, బాలింతలు, చిన్నారుల తల్లులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మల్లీశ్వరి మాట్లాడారు. అంగన్ వాడీ టీచర్లు మంతెన విజయరాణి, కర్ణకంటి వాణీస్వర్ణవీణ, అన్నం రోజారమణి, నామోజు జ్యోతి, ఏఎన్‌ఎం సబిత, ఆశలు రజిత, స్వరూప పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలో పోషణ మాసం'

తరిగొప్పుల: మండలంలోని నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో జీపీ లెవల్ పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ హాజరై గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రీ స్కూల్ పిల్లలకు ఎత్తు, బరువు, చుట్టుకొలతలు తీసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ వనిత, ఆయా లక్ష్మి, ఆశా కార్యకర్త కనకలక్ష్మి పాల్గొన్నారు.

సీపీఎస్, యూపీఎస్‌ను రద్దు చేయాలి

పాలకుర్తి టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే విధంగా ప్రవేశపెట్టిన సీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మావన వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. 20 వేల మంది ఉద్యోగులకు రాష్ట్రంలో బదిలీలతోపాటు పదోన్నతులు కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా బైకాని వెంకటయ్య

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా బైకాని వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షులుగా బి సూర్యప్రకాష్, మహిళ ఉపాధ్యక్షులుగా బొలిశెట్టి ప్రవీణ, ఉపాధ్యక్షులుగా ఆర్ క్రాంతికుమార్, కార్యదర్శిగా ఝాన్సీరాణి, రావులు మనోహర్ ఎన్నికయ్యారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
కె. రాజశేఖర్ (S.R) : 9640341435 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191